క్లుప్తంగా

ఆకట్టుకున్న ఎల్ఐసీ కళాజాత



పలమనేరు: ప్రజాధనం ప్రజా ప్రయోజనాల కోసమేనంటూ స్థానిక ఎల్ఐసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కళాజాత ప్రజలను ఆకర్షించింది. బెంగళూరులో ఈనెల 16 నుంచి 19 దాకా సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ యూనియన్ 13వ మహాసభల నిర్వహిస్తున్న నేపథ్యంలో కళాజాత బృందం రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా కార్యక్రమాలను నిర్వహిస్తూ శుక్రవారం ఇక్కడ ప్రదర్శన ఇచ్చింది. ఎల్ఐసీ సేవలు, ప్రయోజనాలు, ఆశయాలను పాటలు, నృత్యాల రూపంలో వివరించింది. కార్యక్రమంలో స్థానిక ఎల్ఐసీ నాయకులు గౌరిశంకర్‌రెడ్డి, మూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అన్నదానం

వి.కోట: పట్టణంలోని లయన్స్‌క్లబ్ సభ్యులు శుక్రవారం దాదాపు 500 మంది పేదలకు అన్నదానం చేశారు.సంస్థ సభ్యుల జన్మదినం పురస్కరించుకుని ప్రతి నెలా 15న స్థానిక కేజీఎఫ్ బస్టాండు వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లాభూరాం, ఇంద్రేష్, మురుగేష్, నరేంద్రరెడ్డి, మిస్రిలాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, రాహుకాల సమయంలో శాస్త్రోక్తంగా అర్చనలు ,అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, వివిధ రకాల పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాల వితరణ చేశారు. ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.

ఐవీఎఫ్‌తో సంతాన సాఫల్యం



శిశువును చూపుతున్న వైద్య బృందం

గుడుపల్లె: సంతానలేమితో బాధపడుతున్న వారికి తమ ఆస్పత్రిలో అరుదైన సంతానోత్పత్తి చికిత్స నిర్వహించామని పీఈఎస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తమ ఆస్పత్రిలో ఐవీఎఫ్(ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) ద్వారా గర్భం దాల్చిన మహిళకు ఈ నెల 6న కాన్పు చేసినట్లు చెప్పారు. తల్లీ శిశువు క్షేమంగా ఉన్నారన్నారు. సంతాలేమితో బాధపడుతున్న వారు తమ ఆస్పత్రిలో యూఐవీ, ఐవీఎఫ్ చికిత్సా విధానంలో తక్కువ ఖర్చుతో తమ కలలను సాఫల్యం చేసుకోవచ్చన్నారు. కాన్పులో ఎలాంటి ఆపరేషన్, కుట్లు లేకుండా సుఖ ప్రసవం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్, ఉషా, విశాలి పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు వెళ్లిన భక్తులు

పుంగనూరు: తమిళనాడు తిరువణ్ణామలైలోని శ్రీఅరుణాచలేశ్వరస్వామి దర్శనార్థం శుక్రవారం ఆరు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు తరలివెళ్లారు. గిరిప్రదక్షిణ అనంతరం శనివారం వీరంతా రానున్నారు. వీరి కోసం డీఎం సుధాకరయ్య ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు ఏర్పాటు చేశారు.

● జబ్బ చరిచిన సేంద్రియ సేద్యం

రైతన్నల్లో మోదం



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి

- వరి సాగులో ఎకరాకు 40 బస్తాల దిగుబడి!
- ప్రశంసలు అందుకుంటున్న రైతన్న



ఎక్కువగా పిలకలు వేసిన వరితో రైతు

పలమనేరు: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన తయారైంది పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లోని రైతుల పరిస్థితి. రసాయనిక ఎరువులు, పురుగు మందులను విపరీతంగా వాడడంతో సారవంతమైన భూములను తమ సహజత్వాన్ని కోల్పోయాయి. దీంతో భూముల పరిస్థితిని చూసి మేల్కొన్న రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. పశువుల పేడ, గొర్రె పెంటికలు, చెట్ల కింద లభించే సారవంతమైన మట్టి, ఎర్రమట్టి, బంకమట్టిలతో పాటు పంటకు సూక్ష్మ పోషకాలను అందించి భూములను సారవంతం చేస్తున్నారు. క్రిమి సంహారకాలకు బదులు వేపకషాయం, జీవామృతం లాంటి వాటిని వాడుతూ ఆరోగ్యకరమైన దిగుబడుల దిశగా సాగుతున్నారు.

పంటల సాగు ఇలా...

డివిజన్‌లో ఎక్కువగా వర్షాధారంపై ఆధారపడి మెట్ట భూముల్లో పంటలను సాగు చేస్తున్నారు. చెరువుల కింద వ్యవసాయ బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసేవారూ ఉన్నారు. ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ సాగవుతుంది. రెండు సీజన్లలోనూ వరి, రాగిని పండిస్తారు. వాణిజ్య పంటలైన కూరగాయలు సాగు ఇక్కడ ఎక్కువగా ఉంది. ఈ పర్యాయం డివిజన్‌లో 900 హెక్టార్లలో వరి సాగైంది. ఇందులో 300 హెక్టార్లు కోతకొచ్చింది. ఈ డివిజన్‌లో సేంద్రియ పద్ధతిలో దాదాపు 150 ఎకరాల్లో వరిసాగు చేశారు. సేంద్రియ వ్యవసాయంతో ఎక్కువ దిగుబడులు సాధించి రైతు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం నడింపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి ఈ పర్యాయం ఎకరా పొలంలో ధనిష్ఠ రకం వరిని సాగు చేశారు. భూమి దున్నకం నుంచి పూర్తిగా సహజ, సేంద్రియ పద్ధతులను అవలంబించారు. ఈయన రసాయన ఎరువులను ఏమాత్రం వాడలేదు. కేవలం సేంద్రియ సూక్ష్మ ధాతువులు, బయోవిట్ గుళికలను మాత్రమే పంటకు వేశారు. దీంతో పంట పిలకలు బాగా పట్టింది. మొదలు దృఢంగా ఉండడంతో వర్షాలకు సైతం వరి నేలకొరగకపోవడం విశేషమనే చెప్పాలి. సాధారణంగా రసాయనిక ఎరువులు వాడే రైతులు వరి సాగులో ఎకరాకు 20 బస్తాల దిగుబడిని సాధిస్తే సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన ఈ రైతు 40 బస్తాలను దిగుబడులు సాధించి ఔరా అనిపించారు!

భూమిలో సత్తువలేక తగ్గిన పంట దిగుబడులు

నాలుగైదేళ్లుగా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం ఇక్కడ శృతి మించింది. దీంతో భూమిలో ఉన్న సారం పూర్తిగా నాశనమై చౌడు బారింది. ఫలితంగా పంటలు పసుపు రంగులోకి మారి అమాంతంగా దిగుబడి పడిపోయింది. దీని వల్ల ఎందరో రైతులు నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. దీనిపై దృష్టి సారించిన వ్యవసాయశాఖ, జిల్లా ప్రకృతి సేద్యం అధికారులు రెండేళ్లుగా గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీనిపై స్పందించిన రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపారు.

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వరి సాగు



మూడేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఈసారి ఎకరాలో వరి సాగుచేశా. పంట బాగా పండింది. గతంలో ఇదే మడిలో రసాయనిక ఎరువులతో పండిస్తే 20 బస్తాల దిగుబడి వచ్చింది. ఇప్పుడు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే 40 బస్తాలు వచ్చాయి. ఈ వరిని మేము ఇంటికి వాడుకుంటాం. బంధువులకు పంపాం. ఎందుకంటే మార్కెట్‌లో లభించే సూపర్‌ఫైన్ రైస్ కంటే ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది కదా.

–ప్రభాకర్‌రెడ్డి, నడింపల్లె

తిరువణ్ణామలైకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు



బస్సు సర్వీసు ప్రారంభంలో మండల ప్రజలు

వి.కోట: మండల కేంద్రం నుంచి తమిళనాడులోని ప్రముఖ శైవ క్షేత్రం తిరువణ్ణామలైకు నూతన సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బస్సును ప్రారంభించారు. ప్రతినెలా పౌర్ణమికి తిరువణ్ణామలై వెళ్లడానికి ఇక నుంచి అవస్థలు పడనవసరం లేదని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. కుప్పం ఆర్టీసి డిపో మేనేజర్ గోపినాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి అన్నప్రసాద వితరణ ప్రారంభించామని ఆలయ మేనేజర్ భాస్కర్ రాజు తెలిపారు. ఆలయానికి వచ్చే అయ్యప్ప స్వాములతో పాటు సాధారణ భక్తులకు మకర సంక్రాంతి వరకు మూడుపూటలా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సౌజన్యంతో అన్నదానం చేయనున్నట్టు చెప్పారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

చౌడేపల్లె: పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన సాధ్యమని, ఆ దిశగా గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ ఈఓ మహేష్‌బాబు కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం స్థానిక లైబ్రరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు మురళి, గ్రంథాలయాధికారి సోముశేఖర్, పాఠకులు పాల్గొన్నారు.

పలమనేరులో పుస్తక ప్రదర్శన

పలమనేరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయంలో 20వేల పుస్తకాలున్నాయని లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ తెలిపారు. గ్రంథాలయ సేవలను పౌరులు, విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె



పలమనేరు: సమ్మె నోటీసు ఇస్తున్న 108 సిబ్బంది

పలమనేరు: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలమనేరు డివిజన్‌లోని 108 సిబ్బంది శుక్రవారం ఆయా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేసి సమ్మె నోటీసులను అధికారులకు అందజేశారు. గంగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద 108 సిబ్బంది పైలెట్ రషీద్, ఈఎంటీ వెంకటేష్ మాట్లాడారు. 108 సేవలను ప్రైవేటు కంపెనీలు కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమకు ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లను అరవిందో కంపెనీ ఇవ్వలేదన్నారు. జీఓ నంబర్ 49ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలో తమకూ ప్రైవేటు ఉద్యోగాల్లో వెయిటేజీనివ్వాలని డిమాండ్ చేశారు.

సదుంలో..

సదుం: 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్‌కు సిబ్బంది వెంకటరమణ, నరేంద్ర రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి ప్రత్యక్ష సమ్మెకు పూనుకుంటామన్నారు.

బోయకొండ చైర్మన్ పదవి బలిజలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న రెడ్డిశేఖర్ రాయల్

పుంగనూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన చౌడేపల్లె మండలంలోని శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని బలిజ కులస్తులకు కేటాయించాలని ఆర్‌పీఎఫ్ జాతీయ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నాయకులు హేమంత్ కుమార్, నానబాలకుమార్, శ్రీకాంత్, జనార్ధన్‌తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బలిజ కులస్తులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్‌తో సీఎంకు వినతిపత్రం పంపుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, బోయకొండ చైర్మన్ పదవిని సీనియర్ టీడీపీ నాయకుడు, న్యాయవాది, యాదవ సామాజిక వర్గానికి చెందిన బి.వెంకటముని యాదవ్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిర్ణయించినట్లు తెలిసింది.

పాదయాత్రగా వెళ్లి..!



కుప్పం: కుప్పం నుంచి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కాలినడకన హైదరాబాద్‌కు వెళ్లి తమ అభిమాన హీరోను కలిశారు. గుడుపల్లె మండలం సోడిగానిపల్లి పాళ్యంకు చెందిన లక్ష్మీపతి, హరికృష్ణ, కదిరప్ప జూ.ఎన్టీఆర్‌ను కలవాలని ఈ నెల 2న సోడిగానిపల్లె నుంచి పాదయాత్ర మొదలెట్టి 650 కిలోమీటర్ల దూరం నడిచి శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఇంటికి చేరుకున్నారు. పాదయాత్రగా వచ్చిన వారిని చూసి ఎన్టీఆర్ ఆశ్చర్యపోయారు. ఆప్యాయంగా ముచ్చటించారు.

డాక్టర్ యుగంధర్‌కు అవార్డు



పలమనేరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ యగంధర్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును ప్రకటించింది. ఆయన కొంత కాలంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు నియోజకవర్గ శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించారు. త్వరలో ఆయన అవార్డును స్వీకరించనున్నారు. స్థానిక వైద్యులు ఆయన్ను అభినందించారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక



జాబ్‌మేళాలో నియామకపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న మైనారిటీ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 25 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. డీఆర్‌డీఏ, సిడాప్, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 48 మంది హాజరయ్యారని, ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, సిసింద్రి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ఆందోళన

పలమనేరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా పలమనేరు, బైరెడ్డిపల్లె వద్ద ఆ పార్టీ నాయకురాలు భువనేశ్వరి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఉచిత ఇసుక పాలసీని పక్కాగా అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి



పలమనేరులో మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ

- పార్టీ శ్రేణులకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపు
- పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శ

పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికాయి. పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి పుంగనూరు కేసుల విషయంగా ఆయన విచ్చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో నాయకులు, వైఎస్సార్ సోషల్ మీడియా నిర్వాహకులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆపై అక్కడి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి గృహానికి వెళ్లి మాట్లాడారు. ఆపై పట్టణానికి చెందిన పలువురు నేతలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డెప్ప, మురళీకృష్ణ, మండీ సుధా, జాఫర్, చెంగారెడ్డి, గణేష్ యాదవ్, మాజీ ఎంపీపీలు రాజేంద్రన్, ఆర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల నేతలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

- ప్రజా రవాణా సదస్సులో కడా పీడీ వికాస్ మర్మత్
- ఆర్టీసీ సర్వీసులపై ప్రయాణికుల ఫిర్యాదులు స్వీకరణ



ప్రజా రవాణ సదస్సులో ఫిర్యాదు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపో అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. శుక్రవారం కుప్పం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అధ్యక్షతన ప్రజా రవాణా సదస్సు నిర్వహించారు. పలువురు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు కాలం చెల్లినవి కావడంతో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నట్టు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పల్లె వెలుగు బస్సులు పాతవి కావడంతో ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. బస్టాండు ప్రాంగణం పైకప్పు, గోడలు శిథిలావస్థకు చేరుకోవడంతో కూలేలా ఉన్నాయని సమస్యలు ఏకరువు పెట్టారు. దూరప్రాంతాలైన విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, తిరుమల ఆర్టీసీ సర్వీసులు సైతం సరైన కండిషన్‌లో లేకపోవడంతో అగచాట్లు తప్పడం లేదని ఫిర్యాదులు చేశారు. దీనిపై స్పందించిన కడా పీడీ తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, ప్రజలకు మెరుగైన సేవలు ఆర్టీసీ నుంచి అందేలా చూస్తానని, నూతన హంగులతో బస్టాండు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎటు చూసినా కార్తీక శోభ



చౌడేపల్లె: మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం



వి.కోట: దీపారాధన చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) పుంగనూరు: ఏడూరులో పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి, గుడుపల్లె: కొండపై వెలిగిస్తున్న కార్తీక దీపం

చౌడేపల్లె: కార్తీకపౌర్ణమి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉపవాస దీక్షలతో మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభం ఎదుట నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆలయం చుట్టూ 101సార్లు ప్రదక్షిణలు చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: మండలంలోని నెక్కుందికొండలపై ఉన్న శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయం, అలాగే ఏడూరులోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కోనేటి వద్ద ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయాలలో హోమాలు, పూజలు చేశారు. పలుచోట్ల మహిళలు ఉపవాస దీక్షలతో సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు.

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె జ్ఞానమల్లేశ్వరస్వామి ఆలయం, సదుం వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, మరకతేశ్వరస్వామి, అరుణాచలేశ్వర స్వామి, వీరభద్రస్వామి, మత్తుకువారిపల్లె మల్లీశ్వరస్వామి, జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.





పలమనేరు: కార్తీకవనంలో పౌర్ణమి పూజలు, కుప్పం: దీపారాధన చేస్తున్న మహిళలు

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం కల్లూరులోని చంద్రమౌళేశ్వర ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.అలాగే మండలంలోని పలు ఆలయాల్లో దీపారాధన చేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలోని కాశీ విశ్వేశ్వర, కట్ట కింద శివాలయం, మోటుమల్లెల శివాలయంలో భక్తిప్రపత్తులతో కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. మహిళలు రాత్రి వరకు దీపారాధన చేశారు. పెద్దగొట్టిగల్లు కాశీవిశ్వేశ్వర ఆలయానికి పీలేరు నుంచి కూడా భక్తులు వచ్చి పూజలు చేశారు. అర్చకులు ప్రసాదాల వితరణ చేశారు.

కార్తీక వనాలను పెంచుదాం

పలమనేరు: పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర తాను పలమనేరులో పెంచిన కార్తీక వనంలో శుక్రవారం కార్తీక దీపారాధన పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో వనభోజనాలు ఉసిరిచెట్టు నీడలో చేయడం శ్రేష్టమని అనాదిగా పాటిస్తుండడంతో ఖాళీ స్థలాల్లో ఉసిరి, బిల్వ, రావి, జమ్మి, వేప లాంటి మొక్కలు నాటాలని ఆయన భక్తులను కోరారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక ఈశ్వర్‌నగర్‌లోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, దాసార్లపల్లెలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. కొంతమంది మహిళలు వారి ఇళ్లలో శివలింగాన్ని పూలతో తీర్చిదిద్ది దీపారాధన చేశారు.



సదుం: అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో..

కుప్పంలో..

కుప్పం:స్థానిక శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం స్వామి వారికి బియ్యం పిండితో ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు నేతిదీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లోని దేవాలయంలోనూ దీపారాధన చేశారు.

మల్లప్పకొండపై..

గుడుపల్లె: మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మల్లేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. రాత్రి ఆలయం చుట్టూ కొండపై కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు.

పంచాయతీల అభివృద్ధికి సమన్వయ కృషి





పెద్దపంజాణి: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, పెద్దపంజాణి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుష్మకీర్తి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపు

వి.కోట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయకృషి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి గాను పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ ఈశ్వరన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరై దిశా నిర్దేశం చేశారు. మండలంలోని పెండింగ్‌లో ఉన్న పనులు, గతంలో జరిగిన అభివృద్ధి పనులపై ఆరా తీసి సమీక్షించారు. అన్ని పంచాయతీలలో పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయకృషి చేయాలని ఎంపీడీఓ బాలాజి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తతొలుత ఎంపీడీఓ, ఆ తర్వాత ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి మాట్లాడారు. వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఏఓ రఖీబా, ఏపీఎం మీరాబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, ఉపాధి హామీ ఏపీఓ మురుగేష్, వైద్యాధికారులు నందిని, సరిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శారద పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26ను రూపొందించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం, సాధారణ, ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీలలో చేయదలచిన అభివృద్ధి పనులను గ్రామసభల్లో చర్చించి ఎంపిక చేసుకోవాలని ఈఓపీఆర్డీ వరప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం :ఎంపీపీ

రొంపిచెర్ల: గ్రామాభివృద్ధికి గ్రామ పంచాయతీ ప్రణాళికలు ఎంతో అవసరమని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, వీఓలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల ప్రణాళికల రూపకల్పనలో సర్పంచులు కూడా కీలకపాత్ర పోషించాలని కోరారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, రిసోర్స్ పర్సన్లు సత్యంరెడ్డి, హరిబాబు, శివకుమార్, ఫారూఖ్, సర్పంచులు నాగిరెడ్డి, అన్సర్‌బాషా, హేమలత, జీవలత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.